క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

పెనుకొండ: పట్టణంలోని 7వ వార్డు దర్గా రోడ్డు, సౌదాగర్ వీధి, ఆర్‌టీసీ ఏరియా, కమాన్ వీధి తదితర ప్రాంతాల్లో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ తెలిపారు. ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు దర్గా సర్కిల్ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని ముతుకూరు–1 గ్రామ పంచాయతీలోని మద్దనకుంటలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ జగదాంబ తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

రాజకీయ పార్టీలతో నేడు సమావేశం

పెనుకొండ: నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం 11 గంటలకు సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని స్పందన సమావేశ మందిరంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. ఇంటింటికీ ఓటర్ల పరిశీలన, ఇతర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

పెను'కొండ'పై కోటి విత్తనాలు



కోటి విత్తనాలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన దృశ్యం

పెనుకొండ: పెనుకొండ కొండపై కోటి విత్తనాలు నాటేందుకు శ్రీకారం చుట్టారు. పర్యాటక పోరాట కమిటీ, ఘనగిరి లక్ష్మీనరసింహ స్వామి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి బుధవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొండపై పచ్చదనాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో 30 రకాల కానుగ, వేప, బూరుగ. టేకు, సీతాఫలం, సీకాయ, మోదుగ, నిద్రగన్నేరు, రావి, వెలగ, వెదురు తదితర రకాలకు చెందిన కోటి విత్తనాలను నాటనున్నట్లు వారు తెలిపారు. పలువురు పట్టణ వాసులతో కలసి విత్తనాలను నాటే విధంగా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కొండపై ఇస్కాన్ ఆలయాన్ని నిర్మించబోతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని కొండ పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టామన్నారు.


అక్రమ మద్యం స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అమరాపురం: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం వలస గ్రామానికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 150, దేవగానపల్లి, తమ్మడేపల్లికి చెందిన ఒక్కొక్కరి నుంచి 25, 40 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను బుధవారం మడకశిర కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ ఆర్.అశోక్‌కుమార్ వారిని రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

ప్రారంభమైన మొహర్రం



రత్నగిరిలో కొలువు దీరిన పీర్లు

రొళ్ల: మండలంలోని రత్నగిరిలో మొహర్రం ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. రత్నగిరి కోట లోపల నాలుగు వీధుల కూడలిలోని చావడి వద్ద పీర్లను కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కార్గిల్ యోధులకు సత్కారం



కార్గిల్ యుద్ధ వీరులను సత్కరిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: స్థానిక జామియా మసీదు కార్యాలయంలో మసీదు ముతవల్లీ నూరుల్లా ఖాన్ అధ్యక్షతన బుధవారం కార్గిల్ విజయ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న విశ్రాంత ఆర్మీ కెప్టెన్ అన్వర్, సిపాయి సుబ్రమణ్యం, హవల్దార్ రంగధామరెడ్డి, మూర్తి, ఎయిర్ ఫోర్స్ ప్రసన్నకుమార్‌లకు టిప్పు సుల్తాన్ పురస్కారాన్ని అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. విశ్రాంత మాజీ ఎయిర్ ఫోర్స్ అధికారి అమీర్‌ఖాన్, ముస్లిం నగారా అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కష్టాలకు చెక్!

- ఒక్క హిందూపురం డివిజన్‌లో నూతనంగా ఐదు విద్యుత్ సబ్‌స్టేషన్లు
- ప్రతి దానికి రూ.4.5 కోట్ల ఖర్చు
- నిర్మాణాలు వేగంగా జరిగేలా అధికారుల చర్యలు

హిందూపురం అర్బన్: హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్యకు ప్రభుత్వం చెక్ పెడుతోంది. ఇందులో భాగంగానే హిందూపురం విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో నూతనంగా ఐదు సబ్‌స్టేషన్‌లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో దానికి దాదాపు రూ.4.5 కోట్లు మంజూరు చేయడంతో పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి.

వేగంగా నిర్మాణ పనులు

హిందూపురం విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని మడకశిర నియోజక వర్గం అగళి మండలం రామనహళ్లి , హిందూపురం నియోజకవర్గం లేపాక్షి మండలం కల్లూరు గ్రామం వద్ద నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ల పనులు 90 శాతం పూర్తయ్యాయి. పెనుకొండ నియోజకవర్గం సోమందేపల్లి మండలం చెర్లోపల్లి వద్ద సబ్‌స్టేషన్ పనులు 70 శాతం పూర్తి కాగా మిగతా పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. మడకశిర నియోజకవర్గం గుడిబండ మండలం కదిరేపల్లి, హిందూపురం మండలం గోళ్లాపురం వద్ద సబ్‌స్టేషన్ పనులు ప్రారంభించాల్సి ఉంది. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తయితే హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజక వర్గాల్లోని పలు గ్రామాల్లో లోఓల్టేజీ సమస్యలకు చెక్ పెట్టినట్లే.

మరిన్నింటికి ప్రతిపాదనలు

అగళి మండలం ఇనగలూరు, రొళ్ల మండలం రంగేనహళ్లి, గుడ్డిగుర్కి , వైబీ హళ్లి, రొద్దం మండలం రెడ్డిపల్లి, బిక్సంపల్లి, పరిగి మండలం పైడేటి వద్ద నూతన సబ్‌స్టేషన్స్ ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు.



అగళి మండలం రామానహళ్లి వద్ద పూర్తికావస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్

వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు

"విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో లోఓల్టేజీ సమస్య అధిగమించి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సబ్‌డివిజన్ పరిధిలో రామనహళ్లి, కల్లూరు, చెర్లోపల్లి గ్రామాల వద్ద నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ పనులు పూర్తికావచ్చాయి. ఆగస్టు చివరి నాటికి వినియోగంలోకి తీసుకొస్తాం. అలాగే మిగిలిన వాటినీ పూర్తి చేసేందుకు చర్యలు చేపడతాం. యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నాం. ఒక్కో సబ్ స్టేషన్‌కు రూ.4 నుంచి 4.5 కోట్ల వరకు వెచ్చిస్తున్నాం.

– భూపతి, ట్రాన్స్‌కో ఈఈ, హిందూపురం



వలస కూలీల ఆకలి తీర్చిన ఏఎస్ఐ

హిందూపురం అర్బన్: నేరం చేసిన వాళ్ల భరతం పట్టడమే కాదు... ఆపదలో ఉన్న వారికి సాయం చేయడంలోనూ కొందరు ఖాకీలు ముందువరసలో ఉంటారు. ఆ కోవలోకే వస్తారు హిందూపురం ట్రాఫిక్ ఏఎస్ఐ రామమూర్తి. పట్టణంలోని రహమత్‌పూర్ వైపు వెళ్లే బైపాస్ రోడ్డు పక్కన వలస కూలీలు గుడారాలు వేసుకొని నివాసం ఉంటున్నారు. అయితే మూడు రోజులుగా పడుతున్న వర్షాలకు ఎటూ వెళ్లలేక గుడెసెలకే పరిమితమయ్యారు. అటు వెళ్లిన ఏఎస్ఐ రామమూర్తి .. వారు పస్తులుంటున్న విషయాన్ని గుర్తించి బుధవారం మధ్యాహ్నం 40 మందికి భోజనాలను అక్కడికే తీసుకెళ్లి వారి ఆకలి తీర్చారు. దీంతో వలస కూలీలు ఏఎస్ఐకు కృతజ్ఞతలు తెలిపారు.



వలస కూలీలకు అన్నం వడ్డిస్తున్న ఏఎస్ఐ, కుటుంబ సభ్యులు

'పురం'లో 13.4 మి. మీ వర్షం

హిందూపురం అర్బన్: పెనుకొండ సబ్‌డివిజన్ పరిధిలోని హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజక వర్గాల్లో బుధవారం రోజంతా వర్షం పడింది. హిందూపురం పట్టణంలో 13.4 మిల్లీ మీటర్లు, మడకశిరలో 10.2 మిల్లీ మీటర్లు, పరిగి, రొళ్లలో 12.4, గుడిబండలో 13.6, రొద్దంలో 9.2, సోమందేపల్లిలో 8.6 మిల్లీ మీటర్ల వర్షం పడినట్లు అధికారులు తెలిపారు.

పెనుకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో నాలుగు రోజులుగా మండల వ్యాప్తంగా చిరుజల్లులతో కుడిన వర్షం కురుస్తోంది. బుధవారం మండలంలో 6.6 మి.మీటర్లగా వర్షపాతం నమోదైనట్లు రెవిన్యూ అధికారులు తెలిపారు.



మడకశిర వద్ద వర్షం కురుస్తున్న దృశ్యం

అనాథకు అంత్యక్రియలు

పెనుకొండ: పట్టణంలో అనారోగ్యంతో మరణించిన అనాథ శవానికి వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. మిట్టాంజనేయ గుడి సమీపంలో ఉంటున్న రమేష్ (65) బుధవారం అనారోగ్యంతో మరణించారు.ఎవరూ తోడు లేకపోవడంతో భార్య పార్వతమ్మ విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకురాలు సుశీలమ్మకి తెలిపారు. సుశీలమ్మ వార్డు సభ్యులు బోయహారతి, అంజలితో పాటు వారి భర్తలు బోయబాబు, శ్రీరాములుకు చెప్పడంతో సొంత ఖర్చుతో వారు అంత్యక్రియలు పూర్తి చేశారు.

తప్పుల్లేని ఓటరు జాబితానే లక్ష్యం



లేపాక్షిలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

లేపాక్షి: తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలని , ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. బుధవారం సాయంత్రం లేపాక్షిలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రీ సర్వేని పరిశీలించారు.

అమరాపురం: స్థానిక తహసీల్దార్ రమేష్‌బాబు మండలంలోని వీరాపురం, గౌడనకుంట, తమ్మడేపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటా సర్వేను పరిశీలించారు. ఎన్నికల సిబ్బంది పక్కాగా ఓటరు జాబితాను తయారు చేయాలని, ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు.

లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన పీడీ



ఏడు శిరస్సుల నాగేంద్రుని విగ్రహం వద్ద అధికారులు

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయాన్ని బుధవారం సాయంత్రం డీఆర్‌డీఏ –వైకేపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేవీఎస్.నరసయ్య సందర్శించారు. ఆయనతో పాటు ఎంఎస్ఎంఈ అధికారి వీరయ్య, సెర్ప్ అధికారి కుమార్, డీపీఎం రామ్మోహన్ ఆలయానికి చేరుకోగా వీరికి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

రొళ్ల: గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని శ్రీనిధి మేనేజర్ నరేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో వార్షిక ప్రణాళిక తయారీపై అవగాహన సంఘ సభ్యులకు అవగాహన కల్పించారు. నరేష్, అసిస్టెంట్ మేనేజర్ వేణు మాట్లాడుతూ బ్యాంకులో తీసుకున్న రుణాలను వృథా చేయకుండా కుటుంబ అవసరాలకు ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు.

అమరాపురం: స్థానిక వైకేపీ కార్యాలయంలో బుధవారం మహిళా సంఘాల లీడర్లు, ఆనిమేటర్లకు ఆర్థికాభివృద్ధి ప్రణాళికపై అవగాహన ఏపీఎం తిప్పన్న అవగాహన కల్పించారు.

ఎరుకలందరూ ఐక్యంగా ఉండాలి

మడకశిర: రాష్ట్రంలోని ఎరుకలందరూ ఐక్యంగా ఉండాలని రాష్ట్ర ఎరుకల ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాకే చిరంజీవి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆదిరెడ్డిపాళ్యంలోని ఓ సమావేశం మందిరంలో బుధవారం నియోజక వర్గంలోని ఎరుకల సమావేశం జరిగింది. ఈసమావేశానికి జిల్లా అధ్యక్షులు బిజిలి గంగులప్ప అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షులు చిరంజీవి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎరుకుల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవరకొండ శంకరరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, అనంతపురం జిల్లా అధ్యక్షులు గోవిందు, జిల్లా మహిళా అధ్యక్షురాలు ముత్యాలమ్మ,అనంతపురం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాకే ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న ఎరుకలు

'మొహర్రం' ప్రశాంతంగా జరుపుకోండి

సోమందేపల్లి: మొహర్రం పండుగను గ్రామాల్లో ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ విజయ్ కుమార్ సూచించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నడింపల్లి, కేతగాని చెరువు గ్రామాల ప్రజలు మొహర్రం పండుగకు అనుమతులు ఇవ్వాలని కోరారు.

పట్టాలు మంజూరు చేయండి

పెనుకొండ: పట్టణంలోని మడకశిర రోడ్డు సర్వేనంబర్ 668లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆక్రమిత ప్రాంతంలో బుధవారం నాయకులు సమావేశం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సహాయ కార్యదర్శి గంగాధర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్‌లు సమావేశంలో పాల్గొన్నారు.

సమయ పాలన పాటించండి

గుడిబండ: సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని ఎంపీడీఓ రామారావు సూచించారు. బుధవారం మండల పరిధిలోని దేవరహట్టి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

'వేరుకుళ్లు' నివారణకు సూచనలు



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న దృశ్యం

గోరంట్ల: మండల పరిధిలోని గుంతపల్లి సమీపంలో బుధవారం రైతులు సాగు చేసిన వేరుశనగ పంట పొలాలను పుట్టపర్తి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, శాస్త్రవేత రవిప్రకాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా వేరుశనగ పంటలో వేరుకుళ్లు తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కాంటాఫ్ హైడ్రోక్లోరైడ్, హెక్సాకొనౌజల్ మందును పిచికారి చేస్తే తెగులు నివారించవచ్చన్నారు. వర్షాధరిత వేరుశనగను జూలై 31 వరకు విత్తుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హిందూపురం సహాయ వ్యవసాయ సంచాలకులు అల్తాఫ్అలీఖాన్, ఏఓ మునికృష్ణ పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని గొంగటిపల్లిలో మొక్కజొన్న, మిరప పంటలను ఏరువాక కేంద్రం పుట్టపర్తి శాస్త్రవేత్తలు రవికిషోర్, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

పేదల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

చిలమత్తూరు: పేద ప్రజల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. బుధవారం చిలమత్తూరులో సర్పంచ్ సంధ్య అధ్యక్షతన నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి దీపిక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాలనే సంకల్పంతో సీఎం జగన్ 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు.11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగానే ప్రభుత్వం అందిస్తుండటంతో ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతి తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, తహసీల్దార్ నాగరాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామ్‌కుమార్, సీనియర్ నాయకుడు రామకృష్ణారెడ్డి, సదాశివరెడ్డి, ఎంపీటీసీలు సనమ్ హుస్నా, కవిత, టీ. కవిత, నాగమణి, మంజునాథ్‌రెడ్డి, ఆదినారాయణ, సర్పంచ్ తిరుమలేష్, మురళి, నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్ తెలిపారు. బుధవారం వైబీ హళ్లి, ఏఆర్ రొప్పం గ్రామ సచివాలయాల వద్ద జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. సర్పంచులు గీత, రామాంజినేయులు, మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణానాయక్, ఎంపీడీఓ సోనిబాయి, తహసీల్దార్ ముర్షావలి, ఈఓఆర్డీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులందరికీ న్యాయం చేకూరుతోందని జిల్లా నోడల్ ఆఫీసర్ శివారెడ్డి తెలిపారు. మండలంలోని మోదాలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ సరస్వతి అధ్యక్షతన ప్రత్యేకాధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహం, సింగిల్ విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ సభ్యులు అంజినప్ప, నారాయణరెడ్డి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



చిలమత్తూరు: లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న దీపిక, మధుమతి

'జగనన్న సురక్ష ' నేడు ఇలా..

లేపాక్షి: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం –3లో గురువారం ఉదయం 9 గంటలకు జగనన్న సురక్షా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహానాయుడు తెలిపారు.

రొద్దం: మండల పరిధిలోని ఆర్ లోచెర్ల గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ తెలిపారు. ఉదయం 10 గంటలకు గ్రామ సచివాలయంలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.



మడకశిరరూరల్: వైబీ హళ్లిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందిస్తున్న దృశ్యం



పరిగి: సర్టిఫికెట్లను అందిస్తున్న నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, ఎంపీడీఓ సరస్వతి తదితరులు

వంద రోజుల పని కల్పించండి

రొళ్ల: జాబ్ కార్డులు కలిగిన ప్రతి కూలీకి వంద రోజుల పని దినాలు కల్పించాలని ఏపీఓ ఓబుళప్ప పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ ఉపాధి కింద రైతుల పొలాల్లో విరివిగా గుంతలు తవ్వించి పండ్ల మొక్కలను నాటించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు.

నేడు వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి వలంటీర్ పోస్టుల ఖాళీలు భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తప్పక హాజరు కావాలన్నారు .

యువకుడి ఆత్మహత్యాయత్నం

పెనుకొండ రూరల్: క్రిమిసంహారక మందు సేవించి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మండలంలోని సుద్దబట్లపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అనిల్ అనే యువకుడు కుటుంబ కలహాలతో గొర్రెలకు ఉపయోగించే క్రిమిసంహారక మందు సేవించాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

హిందూపురం టౌన్: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హిందూపురంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ హసీనా సుల్తానా పేర్కొన్నారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండగా వాగులు, వంకలు, చెరువులకు భారీగా వరద నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే వెంటనే హిందూపురం కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ గురుప్రసాద్ 9182189768, సుభాషిణి 9133142017కు సమాచారం అందజేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



మున్సిపల్ వైస్‌చైర్మన్ జబీవుల్లా ఇంటిలో విందుకు హాజరైన దీపిక, పార్టీ నాయకులు

హిందూపురం/చిలమత్తూరు: 'నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేయడమే ధ్యేయం.. ఇందులో భాగంగానే అందరినీ కలుపుకొని పార్టీని బలోపేతానికి కృషి చేస్తాం' అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ ఆర్యవైశ్య నాయకులు బైసాని రాంప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా ఇళ్లలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యారు. జబీవుల్లా నివాసంలోనే ముస్లింలో సమావేశమై రాబోవు ఎన్నికల్లో పార్టీ గెలుపునకు సహకరించాలని కోరారు. మరోవైపు చిలమత్తూరులో సోమఘట్ట సర్పంచ్ రత్నమ్మ, లక్ష్మీపతిరెడ్డి ఇళ్లకు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత కొడికొండ రామచంద్రారెడ్డి, సుందరరాజు, చిలమత్తూరులో సర్పంచ్ సంధ్య, దివాకర్ రెడ్డి, ఎంపీటీసీ నాగమణి గృహాలకు వెళ్లి వారితో మాట్లాడారు. అంతకుముందు సోమఘట్టలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై ర్యాలీ



చిలమత్తూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చిలమత్తూరు/లేపాక్షి: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అకృత్యాలను నిరసిస్తూ లేపాక్షి మండలం పి.సడ్లపల్లితో పాటు చిలమత్తూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ రెడ్డిరమణమ్మ మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని, మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

అపెరల్ పార్క్ ప్రారంభం



స్టే ఫిట్ అపెరల్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: నైపుణ్యం ఉండి అవకాశాల కోసం ఎదురు చూస్తున్న గ్రామీణ నిరుపేదలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా హిందూపురంలో అపెరల్ పార్క్‌ను ప్రారంభిస్తున్నట్లు హిందూపురం వ్యాపార అపెరల్ పార్క్ లిమిటెడ్ చైర్మన్ గణపతి రెడ్డి, ఎండీ డాక్టర్ రామ్‌ప్రసాద్‌రెడ్డి, సీఈఓ వంశీరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం చిన్న గుడ్డంపల్లి సమీపంలో హిందూపురం వ్యాపార అపెరల్ పార్క్, స్టే ఫిట్ అపెరల్స్‌ను వారు ప్రారంభించారు. దీని ద్వారా ప్రత్యక్షంగా 5 వేల మందికి ఉపాధి దక్కుతుందన్నారు.